# తిరిగి రాని నేను

## హిందీమూలం: డాక్టర్ ఓంప్రకాష్ కెజరీవాల్

రేప్రొద్దున మీరంతా నా కోసం ఎదురు చూస్తారు. కానీ నేను రాను.

రేప్రొద్దున ఏమిటి? "ఈ రోజు ప్రొద్దున" అనే అనాలి. ఎందుకంటే, ఇప్పుడు రాత్రి రెండు గంటలౌతూ వుంది. రాత్రి ఇంత పొద్దు పోయే వరకూ, మేల్కొని వుండటం, నాకు కొత్తేమీ కాదు. ఎందుకంటే చదువుకోవటం వ్రాసుకోవటం ఇవన్నీ రాత్రిపూటే చేస్తూ వుంటాను. సాధారణంగా... కానీ యీ రాత్రి తాలుకూ నిస్తబ్ధత, అంధకారం నాలో నిండిపోయాయి.


ఈ నీరవ నిశ్శబ్ద వాతావరణంలో దీన్ని నేను వ్రాస్తున్నాను. రేప్రొద్దున యేమౌతుందో స్పష్టంగా చూడగలుగుతున్నాను కూడా....

రవీంద్ర సదనంలోని ఆ సభా ప్రాంగణం, పూర్తిగా నిండిపోయి వుంది. అదిగో, గవర్నరూ, ముఖ్యమంత్రీ కూడా వచ్చేశారు. సభకు అధ్యక్షత వహించటానికి, నోబుల్ పురస్కార విజేత, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ శాఖ ప్రస్తుత అధ్యక్షుడు, నా చిరకాల మిత్రుడు అయిన సింప్సన్ మహాశయుణ్ణి, నా కోరిక మేరకు ఆహ్వానించటం జరిగింది. వారెప్పుడో అక్కడికి చేరుకున్నారు. ముఖ్య అతిథులంతా విచ్చేశారు. కేవలం నా కోసం వాళ్లంతా నిరీక్షిస్తున్నారు. కానీ నేను రాను.

అక్కడి గడియారపు ముళ్ళు పదిగంటలవుతున్నట్టు సూచిస్తూ కదుల్తున్నాయి. నెమ్మది నెమ్మదిగా ఇంతవరకూ నేనక్కడికి చేరుకోకపోవటం గురించి గుసగుసలు మొదలయ్యాయప్పటికే.

అదుగో, పది గంటలయింది. నేనింకా రాలేదు. ఇప్పుడిక, ఈ విషయం గురించి గట్టిగానే మాట్లాడుకుంటున్నారు. సభా నిర్వాహకుల్లో, ఒకరు ప్రశ్నార్థకంతో ముఖ్య అతిథి దగ్గరికి వస్తారు. "ఏ మీటింగ్ అయినా అతను లేట్‌గా రావటం నేనింతవరకు ఎరుగను. మరో ఐదు నిముషాలు చూద్దాం" అంటారు బిల్ సింప్సన్. మెల్లిమెల్లిగా ఆ ఐదు నిముషాలూ గడిచిపోతాయి.

ఆ మాటకొస్తే ఏ సభ అయినా, పది పదిహేను నిముషాలు ఆలస్యంగా ప్రారంభం కావటం పెద్ద వింతేమీ కాదు. మన భారతదేశంలో మరీనూ.. కానీ



ఈ నీరవ నిశ్శబ్ద వాతావరణంలో దీన్ని నేను వ్రాస్తున్నాను. రేప్రొద్దున యేమౌతుందో స్పష్టంగా చూడగలుగుతున్నాను కూడా....

అందరికీ తెలుసు. ఇవాల్టి ఈ సమావేశం సాధారణమైనది కాదని, రాష్ట్రానికి చెందిన ప్రముఖ వ్యక్తులే కాదు, ఇతర దేశాలకి చెందిన ఎంతోమంది విశిష్ట వ్యక్తులూ, అతిథులూ కూడా విచ్చేసే ఇలాంటి సమావేశాలు ఆలస్యంగా ప్రారంభం కావు.

అదుగో ఐదు నిముషాలేమిటి, పది నిముషాలు గడిచిపోయాయి. కానీ నేనింకా రాలేదు. సింప్సన్ మహాశయుడు, సభా నిర్వాహకుల్లో ఒకరికి సైగ చేసి పిలిచి అంటారూ - 'ఏదో పెద్ద పొరపాటే జరిగినట్టుంది. అతని హోటల్ రూమ్‌కి ఎవరినైనా పంపి కనుక్కుంటే మంచిదేమో' అని. ఇప్పటి దాకా నేనక్కడికి చేరుకోకపోవటం గురించి రకరకాలుగా మాటలు వినిపిస్తున్నాయి. కానీ నేను రాలేదు.

అప్పుడు మీరంతా, హోటల్ కిందే, చాలా సేపటి నుంచీ నా కోసం ఎదురు చూస్తున్న వాళ్లతో కలిసి నా కోసం రూమ్‌కి వస్తారు.

మీరంతా వచ్చి నా గది కాలింగ్ బెల్ కొట్టటం నాకు కనిపిస్తూనే వుంది. ఒకసారి, రెండవసారి, మూడవసారి.... నెమ్మదిగా..... తరువాత ఓ పెద్ద గంట. అయినా జవాబు రాదు. తలుపు మెల్లిగా తోస్తారు. తలుపంత సునాయాసంగా తెరుచుకోవటం చూసి మీరంతా తప్పక ఆశ్చర్యపోతారు. ఒక్కసారిగా లోపలికి వచ్చి గది నాలుగువైపులా పరికిస్తారు. కానీ నేను కనిపించను.

**"వచ్చి నా గది కాలింగ్ బెల్ కొట్టటం నాకు కనిపిస్తూనే వుంది. ఒకసారి, రెండవసారి, మూడవసారి.... నెమ్మదిగా.....తరువాత ఓ పెద్ద గంట. అయినా జవాబు రాదు. తలుపు మెల్లిగా తోస్తారు. తలుపంత సునాయాసంగా తెరుచుకోవటం చూసి మీరంతా తప్పక ఆశ్చర్యపోతారు. ఒక్కసారిగా లోపలికి వచ్చి గది నాలుగువైపులా పరికిస్తారు. కానీ నేను కనిపించను..."**

నా ఈ ఉత్తరం కనిపిస్తుంది.

చూస్తారు. కానీ నేనురానని.

కానీ, కానీ ఎందుకిలా?

నా జీవితంలో మహత్తరమైన రోజది. సంవత్సరాల తరబడి చేసిన నా కృషికి, కాదు కాదు తపస్సుకు ఫలితం లభించే సుదినం ఇది. నిజానికి మొన్ననే ఈ సంవత్సరపు నోబుల్ పురస్కార విజేతను నేనే.' అన్నవార్త అందిన రోజే ఈ ఫలితం నాకు లభించింది. నా మటుకు ఇది నాకు గొప్ప విషయమే. నాకేమిటని, మొత్తం దేశానికి, దేశానికే కాదు, ఈ తృతీయ విశ్వానికే సంతోషవార్త ఇది. దీనికి కారణమేమిటంటే, ఇప్పటిదాకా మొదటి ప్రపంచ దేశాల శక్తులన్నీ కలిసి ఈ శాఖలో నోబుల్ బహుమతి రానీయకుండా వంచిస్తూ వచ్చాయి. అర్థశాస్త్రంలో నోబుల్ బహుమతి వచ్చి ఇప్పటికి ఇరవై ఐదు సంవత్సరాలైంది. 1969తోమొదలైన ఈ క్రమంలో బహుమతినందుకున్న ముప్ఫై యేడు మంది విఖ్యాతుల్లోనూ, ఇరవై మూడు మంది అమెరికన్లే. ఆరుగురు ఇంగ్లండ్‌కి, ఇద్దరు నార్వేకి, ఒకరు స్వీడన్‌కి చెందిన వారు. వీరు కాక, నెదర్‌ల్యాండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలకి చెందిన వారు ఒక్కొక్కరు. ఇంకొకరు సోవియట్ రష్యా నుండి. వీరంతా అభివృద్ధి చెందిన దేశాల సమస్యల వైపు మాత్రమే దృష్టి కేంద్రీకరించారు. కానీ ఈ ప్రపంచంలో ఆకలితో దారిద్ర్యంతో, కరువుతో నిండిన ఈ అతి పెద్ద భూభాగం గురించి అధ్యయనం చేసేవారంతా అస్పృశ్యులుగా వుండిపోయారు. నేనీ విషయాన్నే అధ్యయనాంశంగా ఎన్నుకున్నాను. ఇప్పటివరకూ నా జీవితాన్నంతా దీనికే వెచ్చించాను. మూడవ ప్రపంచ దేశాల ఆహార సమస్య ఎలాంటిది? పెరుగుతున్న జనాభాకూ దీనికీ సంబంధం ఏమిటి? కరువు అన్న స్థితి ఎప్పుడు, ఎలా వస్తుంది? ఇందులో ఆయా దేశపు రాజకీయ పరిస్థితుల పాత్ర ఎంత? అభివృద్ధి చెందిన దేశాల రాజకీయ పరిస్థితులతో దీన్ని పోల్చి చూడటం ఎలా? ఈ ప్రశ్నలన్నింటికీ సంబంధించి ప్రపంచ మొత్తానికి నేనిప్పుడు గొప్ప విశ్లేషకునిగా పరిగణింపబడ్డాను. ఈ ఆహార సమస్యలకు సంబంధించినంత వరకూ సంపూర్ణ విశ్వాన్ని ఒకటిగా తీసుకోవాలనీ నా వాదన. ప్రపంచంలోని అనేక దేశాలు ఆకలి చావులతో, కరువు కాటకాలతో అలమటిస్తూ వుంటే, తిండి గింజల ధరల తగ్గుదలను ఎదుర్కొనేందుకు, లక్షల టన్నుల తిండి గింజల్ని మంటలకు ఆహుతి చేసిన సంపన్న దేశాల మనస్తత్వాన్ని దుయ్యబట్టిన నన్ను, కొందరు విద్వాంసులు 'విశ్వాంతరాత్మ' అని "Conscience of the World" అనీ బిరుదులిచ్చి ఆకాశానికెత్తేశారు.

ఈ కారణాలన్నింటి వల్ల, నా స్థాయి పెరిగిపోయిందనీ, నాకు ఈ సంవత్సరపు నోబుల్ బహుమతి రాకపోతే, వాటిలోని గౌరవం నిజాయితీలను అనుమానించాల్సి వస్తుందని మరికొందరు అభిప్రాయపడ్డారు కూడా. నోబుల్ పురస్కార సమితి సభ్యుల మధ్య నా పేరును గురించి చాలా వేడి వాడి చర్చలు జరిగాయని తెలిసింది కూడా. నోబుల్ బహుమతుల చరిత్రలో ఇద్దరు భారతీయులు సువిఖ్యాతులయ్యారట! సమితి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఏకాభిప్రాయానికి వచ్చిన ఒకే ఒక విజేత రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ ఇద్దరిలో మొదటి వ్యక్తి. కాగా రెండవవారు సమితి సభ్యులందరి మధ్యా ఇదివరకెప్పుడూ లేనన్ని సుదీర్ఘ వాదోపవాదాలకు కారకుడైన వ్యక్తిగా నేను. ఇది మరికొందరి అభిప్రాయం. కానీ ఆఖరికి నా పేరునే ఆమోదించటం జరిగింది. కారణం, నన్ను కాదని వేరే సంపన్న దేశానికి చెందిన ఆర్థిక శాస్త్రవేత్తకు బహుమతి నిచ్చినట్టయితే, అది అభివృద్ధి చెందిన దేశాలకూ, వెనుకబడి వున్న దేశాలకూ మధ్య ఓ రాజకీయ సమస్యగా పరిణమించవచ్చునన్న భయం. ఆఖరికి నా పేరును వ్యతిరేకించే వారికి ఇలా ఓటమిని అంగీకరించక తప్పలేదు. ఫలితం తృతీయ ప్రపంచ దేశాలకు చెందిన ఒక ఆర్థిక శాస్త్రవేత్తకు నోబుల్ బహుమతి నిచ్చారన్న వార్త. అడవిలో దావానలంలా, ప్రపంచ మొత్తానికి వ్యాపించింది.

ఇక్కడికి ఈ సమాచారం చేరీ చేరగానే, టెలిగ్రాములు, టెలిఫోన్ల వెల్లువ నన్ను ముంచెత్తింది. తెలిసిన వాళ్ళు, తెలియని వాళ్ళు, స్నేహితులు, బంధువులూ, హితైషులూ, ఇష్ట వున్న వాళ్ళూ, ఇష్టం లేని వాళ్ళూ, నా అభివృద్ధికి ఉప్పొంగిపోయే వాళ్ళూ, నా ఉన్నతిని నిరసించే వాళ్ళూ, నా పట్ల సహృదయత ప్రదర్శించే వాళ్ళూ, చాలా సంవత్సరాల నుండీ నన్ను ద్వేషించే వాళ్ళూ, ఒకరేమిటి అందరూ తమకు తోచినట్టు నన్ను అభినందించారు. సందేశాలను పంపారు. నేనా రోజంతా మరో లోకంలో విహరించాను. నా శరీరమంతా అదేదో తెలీని మత్తు ఆవహించి వుంది.

ఈ దేశపు సుపుత్రుని గౌరవించాలన్న ఉద్దేశ్యంతో మీరంతా కలిసి, ఈ రోజు ఈ సభ నిర్వహించాలని సంకల్పించారు. కాస్త ఆలోచిస్తే ఆశ్చర్యమవుతుంది. ఈ కాలంలో ఒక్క రోజులో ఎన్నెన్ని చిత్రాలు జరిగిపోతాయికదూ! ఒక్క రోజులోనే విదేశాలకు చెందిన ప్రముఖులూ, నిపుణులూ ప్రసిద్ధిగాంచిన పత్రికా విలేఖరులూ, అందరూ విచ్చేశారు. సభకు అధ్యక్షత వహించటానికి బిల్ సింప్సన్‌ను పిలిపించమని నేను మిమ్మల్ని కోరాను. బిల్ నాకు చిరకాల స్నేహితుడు. ప్రచురణకు పంపే ప్రతి పేపర్‌నూ అతనికి చూపేవాణ్ణి. ప్రతిసారీ, అతనెంతో సహకరించేవాడు. కనీసం అతనైనా హృదయ పూర్వకంగా, నా గురించో మంచిమాట అంటాడని నా నమ్మకం. ఈ గవర్నర్లూ, ముఖ్యమంత్రులూ పార్లమెంటు సభ్యులూ, తదితర రాజకీయ నాయకులంతా నన్ను ఆకాశానికెత్తేశారు. కానీ వారిలో మాటల్లో ఒక కృత్రిమత, అవాస్తవికత కనిపిస్తాయి నాకు.

సరే.. ఇప్పుడేమవుతుందో నాకు తెలీదు. కారణం ఇవాల్టి సభలో నేను వుండను కదా! నేను రాకపోవటం వల్ల బిల్‌కి నిజంగానే బాధవుతుంది. తక్కిన వాళ్ళు అంటే గవర్నరూ, ముఖ్యమంత్రీ ఇంకా ఇతర రాజకీయ నాయకులూ మరికొద్ది సేపట్లోనే మోసం అబద్ధం దుర్గంధపూరితమూ అయిన తమ లోకంలోకి వెళ్ళిపోతారు.

ఒకే ఒక గంటలో వీళ్ళంతా నన్ను మరిచిపోగలరు కూడా. కానీ ఇదంతా ఉదయం... ఇంకా చాలా సేపటిగ్గానీ జరగదు. మీరంతా నా గురించి ఎదురు చూడటం, నేను రాకపోవటం దీనికి గల కారణాల గురించి ఇదిగో, ఇప్పుడు నేను మీకు చెప్పబోతున్నాను.

ఈ రోజు మీరంతా కలిసి పెద్దఎత్తున నన్ను సన్మానించదలచారు. అదలా వుంచండి. ఈ సభకంటే ముందుగానే కొందరు నా సహాధ్యాయులూ, బంధువులూ, స్నేహితులూ ఓ చిన్న పార్టీని ఏర్పాటు చేశారు. ఇది నాకు తెలీకుండానే జరిగింది సుమా! మధ్యాహ్నాం నా మరదలు రమ వచ్చి అందీ - బావా! ఇవాళ రాత్రి మీ డిన్నర్ మాతోనే. మేమంతా కలిసి ఓ రెస్టారెంట్ బుక్ చేశాం.

ఇదంతా కేవలం మా సంతోషం కోసమే. బైట వాళ్ళెవరూ ఈ పార్టీకి రావటం లేదూ అని. ఆ తరువాత పార్టీకి రాబోయే వాళ్ళ పేర్లన్నీ చదివింది. అందరూ నాకు బాగా కావలసిన వాళ్ళే. నా వైపు నుంచి ఓ ఐదు మందిని మాత్రమే తీసుకురావటానికి అనుమతించింది రమ.

విశ్వవిద్యాలయానికి చెందిన ఒకరిద్దరు సహాధ్యాయులూ, నా సబ్జెక్ట్‌తో పరిచయం లేకపోయినా, నాకు మంచి మిత్రులైన డాక్టర్ గుప్తాగారూ, వీరిని నా తరఫున ఆహ్వానించాను. అందరూ కలిసి ఓ ముప్ఫై మంది... అంతే..

రాత్రి దాదాపు ఎనిమిది గంటలకి పార్క్ స్ట్రీట్‌లోని ఒక సువిఖ్యాతమైన రెస్టారెంట్‌లో పార్టీ ప్రారంభమైంది. ఆ రెస్టారెంట్ నాకు కొత్తేమీ కాదు. నోబుల్ బహుమతి గురించిన సమాచారం,

తెలిసి కొద్ది గంటలే అయినా అదేదో పాత వార్తే అయినట్టుగా వుంది నా మటుకు నాకు. నిజానికి ఆ పార్టీలోనే అంతా తలక్రిందులైపోయింది. నా అస్తిత్వమే రెండు భాగాలుగా విడిపోయింది. అందుకే నేనిలా వ్రాసేందుకై కూర్చున్నాను కూడా.

మీరే దృశ్యాన్ని ఊహించుకుని చూడగలరేమో! రాత్రి వెలుగులో ధగధగలాడుతున్న రెస్టారెంట్‌లో మహత్తరంగా సాగుతోంది పార్టీ. మత్తు పానీయాల పట్ల నాకు మక్కువ కాస్త ఎక్కువేనని, నా మిత్రులందరికీ తెలుసును. అందువల్ల, అతిథులకంటే మంచి పానీయం నా కోసం ఏర్పాటు చేయటం జరిగింది. శివాస్ రీగల్ అంటే నాకు ప్రాణం. కానీ ఇవాళ షాంపేన్ కూడా తాగాల్సి వచ్చింది. ఓ రకంగా ఇది నా రోజు కదా! నాకు దీనిపై హక్కు వున్నట్టే మరి! నా జీవితంలో .... నా జీవితంలోనే మహత్తరమైన ఘడియ మరి వేరే ఏముంటుంది? కానీ మనిషి జీవితంలో ఒక్కో క్షణానికి, ఒక్కో ముహూర్తానికి ఎంతో విలువ వుంటుంది. ఆ క్షణంలో అనుకోనిదేదో జరిగిపోతుంది. నా విషయంలోనూ అదే జరిగింది.

నేనింతకు ముందు చెప్పినట్టు పార్టీ జోరుగా సాగుతోంది. కొద్దిగా షాంపేన్, రెండు పెగ్గులు శివాస్ రీగల్ తాగిన తరువాత కొద్ది కొద్దిగా మత్తు నన్నావహించింది.

బల్లలపై తిండి పదార్థాలన్నీ సర్దేశారు వైటర్స్. రమ లేచి వచ్చి స్వయంగా నా ప్లేట్లో వడ్డించింది. నా మనసు సంతోషంతో నిండిపోయింది. ఒకవైపు జీవితంలో ఇంత పెద్ద గౌరవం లభించటం, మరోవైపు నా దగ్గరి వాళ్ల సామీప్యం. వీళ్లంతా నా కోసం జీవించగలరు. మరణించనూ గలరు. అలా నాకనిపించింది. మనిషికి జీవితంలో ఇంతకంటే, ఇంతకంటే ఏం కావాలి? కావలసినదేముంటుంది గనుక?

అదుగో... అప్పుడే ... అప్పుడే ఈ సంఘటన జరిగింది.

చెప్పానుగా పార్టీ జోరుగా సాగుతోందని. నేను కూర్చున్న చోటు నుండి రెస్టారెంట్ బయటి దృశ్యాలు చక్కగా కనిపిస్తాయి. ఇది కేవలం కాకతాళీయం. అటువైపు లేత ముదురు రంగుల్లో అద్దాలు.

నలువైపుల నుంచీ నవ్వులు, కేరింతలు, తుళ్లింతలు వినవస్తున్నాయి. వాతావరణమంతా ఉల్లాసం ఉత్తేజంతో నిండి వుంది. భోజనానికందరూ సన్నద్ధులవుతూ వున్నారు. ఓ గుక్క విస్కీ తాగేందుకు నేను గ్లాస్ నోటి దగ్గరకు చేర్చబోతూ తలయెత్తాను.

అదుగో సరిగ్గా అప్పుడే ఆ దృశ్యం నా కంటపడింది. మొదలైతే ఆ దృశ్యానికర్థం నాకు తట్టలేదు. కానీ ఆ తరువాత ఆ దృశ్యం, దాని అర్థం నెమ్మది నెమ్మదిగా నా వ్యక్తిత్వంపై ముద్రవేశాయి. గ్లాసులో ఉప్పువేసి మీరెప్పుడైనా చూశారా! ఉప్పు పొర మెల్ల మెల్లగా నీటి అడుగున చేరి నెమ్మది నెమ్మదిగా ఆ నీళ్లలో కలిసిపోతుంది. సరిగ్గా అలాగే జరిగింది ఇప్పుడు.

బహుశా ఆ దృశ్యం ఓ అర నిముషం కూడా వుండి వుండదేమో! కానీ అదే నా జీవితాన్ని ఓ కొత్త మలుపు తిప్పేసింది. దాన్ని గురించే నేను మీకు రాయబోతున్నానిప్పుడు.

అదేదో అసాధారణమైన దృశ్యమా అంటే కానేకాదు. అయినా ఎప్పుడు ఏ విషయం ఎవరి జీవితాన్ని ప్రభావితం



చేస్తుందో ఎలా చెప్పగలం?

ఆ.... చెప్పానుగా విస్కీ గ్లాసునిలా పైకెత్తానని.... అలాగే పెదవుల కానించబోతున్నాను. గ్లాసుకటువైపు దృశ్యంవైపు నా దృష్టి నిలిచింది. ఆ అద్దాల కవతలివైపు నుంచీ ఓ బిచ్చగాడు లోపలికి చూసేందుకు ప్రయత్నిస్తున్నాడు. అతగాడి బట్టలు పీలికలైపోయివున్నాయి. నల్లటి గాజు పలకలు, నల్లటి అతని శరీరఛాయను మరింత నల్లగా చూపుతున్నాయి. అతగాని వయసెంత వుంటుందో గానీ,ముసలివాడిలాగానే కనిపిస్తున్నాడు. చింపిరి జుట్టు, గడ్డం, ఒక చేయి చాచినట్టుగా వుంది. వణుకుతూ కూడా వుంది. లోపలికో చూపు చూసి వెళ్ళిపోయాడంతే. ఆ దృశ్యం అక్కడికైపోయింది. కానీ ఆ చూపులో ఏముంది? శూన్యత నిండి వుంది పూర్తిగా.... ఒకే ఒక్క క్షణం.... అంతే... ఆ తరువాత అతనక్కణ్ణించి వెళ్ళిపోయాడు. ఇదుగో ఇప్పుడు, ఇలా రాసేటప్పుడు కూడా. ఆ దృశ్యమే నా కళ్ళముందు కొస్తూ వుంది. మనసులో లక్షలాది ప్రశ్నలు. వాటికి సమాధానం అప్పటి నుంచి వెదుకుతూనే వున్నాను. ఆ ప్రయత్నం ఆగటం లేదు. కానీ కానీ ప్రశ్నలు, ప్రశ్నలు నిస్తేజం నిండిన నా మనసు నిండా.

బీదరికం. ఆకలిదప్పులు, కరువు వీటి గురించే జీవితాంతమూ అధ్యయనం చేసిన నేను వీటిని సరిగా అర్థం చేసుకోగలిగానా! ఇప్పుడీ బిచ్చగాడు నా అధ్యయనానికో ప్రశ్న చిహ్నంగా నిలబడటమే కాదు, వాటినన్నింటినీ నిష్ప్రయోజనమైనవిగా కూడా చేసేవాడు.

నా అధ్యయనంలో వీటిని గురించే చర్చించిన నాకు యదార్థంగా వీటి గురించిన అవగాహన వుందా అసలు? ఇన్నిదినాలూ నేను వ్రాస్తూ వచ్చిన విషయాల వల్ల నేను పొందిన సర్వోత్కృష్ట గౌరవం మాట అటుంచి, వాటి గురించిన వాస్తవిక దృక్పథం నాకుందా అసలు? వీళ్ళ భుజాలెక్కి అందలాలు ఎక్కానా నేను?

ఈ బిచ్చగాడు నాకేమవుతాడు? నా లెక్కల్లో ఇతగాడో మనిషి కూడా కాదు. ఒక అంకె మాత్రమే రక్త మాంసాలు బుద్ధి, వివేకం, ఆలోచనా శక్తి ఇవన్నీ వున్న ఓ సాటి మనిషిని నేను నా విజ్ఞానంతో మాయలో, ఒక అంకెలా మార్చేశాను. ఇదేనా నా గొప్ప విజయం... నేను ఆలోచిస్తూ వున్నాను. నా లెక్కల్లో ఇతనిదే అంకె? ప్రపంచం మొత్తం మీద ఆకలి దప్పులతో అలమటించే బికారులని లెక్కించి శూన్యాలుగా అంకెలుగా మార్చానే? అసలింతకీ ఇతను అంకెల్లో వున్నాడా లేక శూన్యాలలోనా! నాలుగో శూన్యమా? ఎనిమిదో శూన్యమా? మొదటి సంఖ్యలోనా! ఎక్కడ! ఎక్కడ! ఈ వ్యక్తుల స్థానం ఏ చోట? నా మస్తిష్కంలో ఇప్పుడు అన్నీ అంకెలే తిరుగుతున్నాయి. ఆ అంకెల మధ్య, కడుపూ, వీపూ ఏకమై ఎండిపోయిన తలవెంట్రుకలు, పెరిగిపోయిన గోళ్ళూ శూన్య దృక్కులతో చూస్తున్న మనుషుల గుంపులు. వాళ్ళంతా నన్ను నిలదీస్తున్నారు. మేమెక్కడ? మేమెక్కడున్నాం అని! వాళ్ళకి జవాబు చెప్పవలసిన బాధ్యత నాదే... వాళ్ళని సున్నాలుగా మార్చిన వాణ్ణి నేనే కదా మరి!

అంతే... నా కథ ఇక్కడే ముగిసింది. ఆ పార్టీ ఎలా ముగిసిందో. హోటల్‌కెలా చేరుకున్నానో నాకే తెలీదు. ముఖంపై ప్లాస్టిక్ చిరునవ్వు పులుముకుని వచ్చి వుంటాను బహుశా!

నాతో ఇక్కడ, ఇప్పుడెవరూ లేకుండానే బాగుంది. అప్పటి ఆ స్థితి నుంచీ నేనింకా కోలుకోనేలేదు. ఆ ప్రశ్నలన్నీ ఇప్పుడు మరింత జటిలంగా తయారయ్యాయి. అవి ఇప్పుడు నా అస్తిత్వాన్నే ప్రశ్నిస్తున్నాయి. ఈ ప్రపంచంలో ఒక భాగంగా నేనూ ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేనని మీకూ తెలుసు. నిజానికి ఆ ప్రశ్నల వలయంలో చిక్కుకున్న ఈ స్థితిలో నన్ను నేనే కనుక్కోలేను.

అందుకే వెళ్ళిపోతున్నాను. ఈ రాత్రి ఈ నిస్తబ్ధతలో, నీరవ వాతావరణంలో నా గమ్యాన్ని వెతుక్కుంటూ వెళ్ళిపోతున్నాను. నేనెక్కడికి వెళ్తున్నానో నాకే తెలీదు. నేను చేస్తున్నది తప్పో ఒప్పో కూడా తెలీదు. ఈ ప్రశ్నలకి జవాబులు దొరుకుతాయో లేదో, ఈ నా అన్వేషణ నన్నెక్కడికి చేరుస్తుందో, ఎప్పటికి చేరుస్తుందో, దీని గమ్యమేదో ఏదీ నేను చెప్పలేను. ఏమైనా చెప్పగలనూ అంటే ఇదే. ఈ అంకెలూ, లెక్కలతో నిండిన ఈ మాయాలోకంలో నేను జీవించలేను. నాకు ఊపిరి అందటం లేదు. నేను వెళ్ళిపోతున్నాను. అందుకే మరోసారి అంటున్నాను మీరంతా నా కోసం ఎంతగానో యెదురు చూస్తారూ అయినా నేను రానూ అని.....

**అనువాదం: పద్మినీవర్ధన్**